# శకునం

## ఇందల లింగమూర్తి

నిన్న ఆవూళ్లో కొత్తసినిమా కొత్తగాకట్టిన హాల్లో రిలీజైంది. రాత్రి సినిమా చూచా డేమో చాలా బద్ధకంగా ఒళ్లు విరుచుకుని, కళ్ళు నులుపుకుని దిగాడు మంచంమీద నుండి ప్రసాద్. ఆరోజు తను మంచంమీద నుండిదిగగానే ప్రతిరోజూ తన యిల్లాలు యింటిపనంతా చక్కబెట్టి సంతోషంగా నవ్వుతూ కనిపించేది. కాని ఆనాడు 'మ్యావ్...మ్యావ్'మంటు భయంకరంగా మెరిసే కళ్ళతో "సుస్వాగతం" అంటూఎదురైంది పిల్లి. ప్రసాద్ పిల్లిని చూసి ఒక్కసారుగా వులిక్కిపడ్డాడు. ఏ ఆపద సంభవిస్తుందోనని భయం అతన్ని వెంటాడింది. చదువుకున్నవాడు అవడంచేత ఇటువంటివి అంతగా పట్టించుకోనకపోయినా ప్రశాంతంగావున్న అతని హృదయం నూరుమణుగుల బరువుతో నిండివుంది.

ఆరోజు క్షురకర్మ కావించుకుని, తలంటి పోసుకుని, గాలికిరేగే వెంట్రుకలతో ఆఫీసుకు త్రోవతీశాడు. అతడు గడపదాటగానే ప్రక్కవాకిట్లో పొరుగింటావిడ నిలుచుంది. ప్రసాద్ ఆమెను చూచి తలవంచుకుని "ఏమండీ! మారత్నం తెల్లవారుతూనే వాళ్ళ అన్నయ్యగారింటికి వెళ్ళినట్లుంది. రాగానే ఈ తాళాలు యివ్వండి" అంటూ ఆమెకిచ్చి వెళ్ళిపోతున్నాడు. ఆవిడ యితన్ని చూచి విరగబడి పకపకా నవ్వింది. ఆమె ఎందుకు నవ్విందో అర్థంకాలేదు. తను అసందర్భంగా మాట్లాడలేదే! ప్రసాద్‌కి ఆమెనవ్వు పిడుగు పడ్డంత భయంవేసింది. ధైర్యం తెచ్చుకుని ఆమెవంక చూశాడు. ఆమె అపుకోవాలన్నా సాధ్యంకానట్లు పకపకా విరగబడి నవ్వుతూనేవుంది. ఇదంతా అతనికి వింతగా కనిపించింది. ఆమెకు తనంటే ఎంతో అభిమానం, వీధిన వెళ్ళేప్పుడుకూడా తన్ని మన్మధుణ్ణి చూసినట్లుగా చూసే ఆవిడ, ఆ రోజు అలా ఎందుకు నవ్విందో అర్థంకాలేదు. ప్రసాద్ మాట్లాడకుండా సాగిపోయాడు.

త్రోవలో ఎవరో కుర్రవెధవలజట్టు అవుపించింది. మామూలుగా తనను తప్పించుకొని గౌరవంగా వెళ్ళేవాళ్ళల్లా, ఆవేళ ప్రక్కనే నిలబడి ఎగాదిగాచూసి వడివడిగా పోతున్న ప్రసాద్‌కు వినిపించేట్లు చప్పట్లు చరిచారు. మెయిల్‌బండిలా వేగముగా టకటకలాడే గుండెతో, బరువుగా ఆఫీసుకువెళ్ళి పడ్డాడు. తను వచ్చేటప్పటికే ఆరోజు శెలవు కావడంవల్ల గుమాస్తాలంతా వాకిట్లో నిలుచునివున్నారు. రెవిన్యూ మంత్రిగారు చనిపోయారు. శెలవు ఇవ్వాలని వైరువచ్చినదని అనుకుంటున్నారు. అంతా ఒక్కమారు ప్రసాద్‌నుచూసి తలఎత్తారు. ప్రసాద్ అందరికీ పరిచితుడే అయినా ఒక్కరూ వెంటనే మామూలుధోరణిలో పడలేదు. ఒకరి ముఖాలు ఒకరుచూసుకొని ప్రసాద్‌గురించి సాంకేతికంగా ఏదోచెప్పుకొని, తేనినవ్వు తెచ్చుకొని ఒక్కసారిగా చూశారు.

'నావైపు ఇంత ఇదిగా అంతమంది ఎందుకు చూస్తున్నారా?' అని తికమకపడి అర్థంకాక పరాసరి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. బంట్రోతుని పిలిచాడు. బంట్రోతు వచ్చి ప్రసాద్ చెయ్యమన్న పని చెయ్యకుండానే అతనిముఖంలోకి చూస్తూ నిలబడ్డాడు. వాడికి నవ్వటానికి మటుకు ధైర్యం చాలలేదు. లేకపోతే నవ్వునేమో?...

ఖాళీగావున్న ఆఫీసులో ఫైల్సుచదివి ఆదనల్లోవున్న బుర్రకి ఏమీతోచక, రేపు రాసుకుందాములే అనే ఉద్దేశంతో సాయంత్రం నాలుగింటికి వంటరిగా బీచ్‌రోడ్డుకు బయలుదేరాడు ప్రసాద్. దారిలో ఎవరో వెనకనుంచి చప్పట్లుకొట్టి పిలిచి విచిత్రంగా చూశారు. కాని ప్రసాద్ తన్నుకాదన్నట్లు ఒక్కక్షణంకూడా ఆగకుండా వెళ్లిపోయాడు.

మంగలిషాపుదాకా వెళ్ళేటప్పటికి వాకిట్లో మామూలుగా తనకు క్షురకర్మచేసే మంగలి నిలుచుని సగౌరవంగా, 'ఎక్కడికి వెళ్లుతున్నారు?' అన్నాడు. ప్రసాద్ సమాధానం చెప్పేలోగానే అతని ముఖంలోకి చూసి మంగలి నాలిక కొరుక్కొని "రహస్యం చెప్పాలి, లోపలికిరండి"... అంటూ సంజ్ఞచేశాడు. ప్రసాద్ తడుముకోకుండా వెళ్ళాడు. మంగలి కళ్ళనీళ్ళ పర్యంతమై,

"మీరు క్రొత్తగా ఉదయం క్రాఫింగ్ కటింగ్ మీసాలు పెట్టమన్నారు. పొరపాటున పనితొందరలో ఒక్కప్రక్కమాత్రం కత్తిరించాను" అన్నాడుభయంతో.

ప్రసాద్‌కు అతను చెప్పేమాటలు వింటూంటే తల తిరిగినట్లయింది. ఒకప్రక్క కోపం అగ్నిజ్వాలలా రేగుతోంది. ఆరోజు తన్నుచూసి అంతమంది ఎందుకునవ్వారో ఇప్పుడు తెలుసుకున్నాడు. ఆవేశం అపుకోలేక పళ్ళుబిగపట్టి అవమానంతో క్రుంగిపోయి ఉదయపు పిల్లిశకునం తలుచుకుంటూ షాపులోకి దారితీశాడు మీసంసరిచేసుకునేందుకు.

★

